జగం నగం నిద్రించీ, నగం మేల్కొనీ ఉంది.

చీకటితో చెలిమి కోసం శీతల వాయువు కమ్ముకొస్తోంది.

గదిలో గుడ్డి వెలుగు గోడల మీద వేలాడుతోంది.

అతని ముఖం మీద అలసట కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

అతను కుర్చీలో కూర్చుని టేబుల్ మీది టెలిఫోన్‌ల కేసి చూపంతా కేంద్రీకరించాడు.

ఆప్తులు ఓ అరడజను మంది బయట అరుగు మీద నిద్రనీ, సుఖాన్నీ ఈనడించుకుంటూ కూర్చున్నారు.

ధర్మరాజు గుమ్మం వద్ద నిలుచుని ఓ క్షణం తటపటాయించి లోని కొచ్చాడు. "తమరు కొంత పక్క వాల్చి కునుకు తీస్తా రని వేచి ఉన్నాను" అన్నాడు.

"ధర్మరాజూ! నా మిత్రుడు చనిపోగా నేను శవ జాగరణ చేయాలి తప్ప సుఖం కోసం నిద్ర సాగించకూడదు" అన్నాడు.

"మీ సేవకుణ్ణి. తమరి దుఃఖాన్ని ఎరిగిన వాడినే నని మనవి చేసుకుంటున్నాను. కానీ ..."

"ధర్మరాజూ! నా స్నేహితుడి చావు నన్ను అతలాకుతలం చేసేసింది. అతడి కోసం నా చేతుల మీదుగా చేయాల్సిన పనులెన్నో మిగిలిపోయాయి."

"చిత్తం!"

"ఈ చరమ రాత్రి తెల్లవారకముందే అతని మరణ వార్త బంధువులకూ, మిత్రులకూ, ఆప్తులకూ అందరకూ తెలియపరచాలి. వాళ్ళంతా ఎక్క డెక్కడో దూర దూరాల్లో ఉన్నారు."

"చిత్తం! వారి పేరు ప్రతిష్ఠలు అందరూ ఎరిగున్నవే కదా!"

"అందుకని రేపు జరగబోయే అంతిమ యాత్ర గురించి స్వయంగా నేనే తెలపాలి. దేశం నలుమూలలకీ బుక్ చేసిన ట్రంకాల్స్‌ను అందుకోవడం కోసం ఈ రాత్రి ఫోను ముందు కూర్చోక తప్పదు. అవతలి వాళ్ళు రిసీవరు ఎత్తగానే నా మిత్రుడి మరణ వార్తను నా నోటి మీదుగా వాళ్ళకు తెలియజేయాలి. వాళ్ళందరూ వచ్చాక ఇక్కడ అంతిమ యాత్రను కొనసాగించాలి. అందుకని, ధర్మరాజూ! ఈ రాత్రి చివరకంటూ ఉండి ఈ పనిని పూర్తి చేసి లేస్తాను."

"మీ సేవకుణ్ణి. తమరి గురించి ఆతృత తప్ప వే రేముంటుంది నాకు. మీరు ఆదేశిస్తే ఏదైనా చేయడానికి మీ ఆప్తులు మీ కోసం బయట వేచి ఉన్నారు. కానీ వాళ్ళకు మీ రేమీ చేయమని చెప్పలేదట. ఇప్పుడు వాళ్ళంతా కూర్చున్న చోటే నిద్రలోకి జారిపోయారు."

"ధర్మరాజూ! వాళ్ళంతా నిద్రలోకి జారిపోయినా నా కోసం నీవు మేల్కొనే ఉన్నావు. నీవు నా సేవకుడివి. నా అంతరంగ విషయాలు తెలుసున్న వాడివి. అందుకే నా చేతుల మీదుగా జరగాల్సిన పను లెన్నో ఇతరు లెవ్వరికీ చెప్పక

# సహగమనం

ముప్పిడి ప్రభాకర రావు



నీ చేతుల కప్పగించాను."

"చిత్తం. ఆ సంగతి నే నెరిగినవాణ్ణే. అందుకే తమరు చెప్పినట్లు అన్నీ సిద్ధం చేసి వచ్చాను. అంతిమ సంస్కారం రేపు సాయంత్రంలోగా జరగాలని మీరు నిర్ణయించిన మీదట నే నేదీ రేవతి కంటూ వాయిదా వేయలేదు."

"అయితే సంస్కారానికి అన్నీ సిద్ధమైనట్టేనా, ధర్మరాజూ!"

"చిత్తం. అందుకోసం అన్నీ సిద్ధపరిచాను.


"బజారంతా వెదికించి మంచి గంధపు చెక్కల్ని సరిపడా ఖరీదు చేశాను. ఊరేగింపుగా వెళ్లడానికి పూల రథాన్ని పురమాయించాను. శవాన్ని అలంకరించడానికీ, దారి పొడవునా చల్లడానికీ పూల తోటల్లోని పూలన్నిటినీ గుత్త బేరం చేయించాను. మేళ తాళాలతో ముందుకు సాగిపోవడం కోసం వాయిద్య గాళ్లను రప్పించాను. ధూప ధూమ సామగ్రినీ, అత్తరు పన్నీరునీ, ధవళ వస్త్రాన్ని - అన్నింటినీ తెప్పించాను."

"ధర్మరాజూ! నీ ఏర్పాట్లన్నీ నాకు సంతృప్తి నిచ్చాయి. రేవతి అంత్యేష్టి కోసం ఇప్పటి నుంచే నా దృష్టి నంతా సమీకరిస్తాను. నా ప్రాణ మిత్రుడు బ్రతికుండగా అత న్నుంచి ప్రతిదీ నేను పొందడమే కానీ, నా నుంచి ఇంతవరకు అతని కిచ్చిం దేమీ లేదు. అతను బతికుండగా నా కా అవకాశమే ఇవ్వలేదు. అందుకని అతను చనిపోయాకైనా అతని అంత్యక్రియలు నా చేతుల మీదుగా జరిపి నా స్నేహ ధర్మాన్ని నిలబెట్టుకుంటాను. లేకపోతే లోకం నాకేసి వేలెత్తి చూపుతుంది. స్నేహ ధర్మాని కిది మాయని మచ్చ అవుతుంది. కనుక, ధర్మరాజూ! నీవు ఇం కేమేమి చేశావో అంతా చెప్పు."

"చిత్తం. నేను ఖరీదు చేసిన మంచి గంధపు చెక్కలను ఈ సాయంత్రమే శ్మశానానికి తరలించి, చితిని పేర్చ మని మనుమల కిచ్చి వచ్చాను."

"ధర్మరాజూ! నా అక్కర లేమిటో నా కన్నా నీకే బాగా తెలును."

"మీ సేవకుణ్ణి. సదా మీ మన్ననలను అందుకుంటున్న వాడిని.






అయినా నన్ను కొన్నింటికి తమరు మన్నించక తప్ప దేమో."

"ఏమిటి, ధర్మరాజూ! నిన్నా నేను మన్నించవలసింది?"

"చిత్తం. ఎందుకంటే నేను వంపిన మనుమలు తిరి గొచ్చి, అప్పటికే అక్కడ అతని కోసం అతని భార్యా బిడ్డలూ, అతని బంధువర్గం అందరూ వచ్చి చితిని పేర్పించి వెళ్లారట."

"ధర్మరాజూ! ఏమిటి నీ వంటున్నది?"

"అయితే నేను వంపిన మనుమలు వాళ్లతో 'మేం రోజు కూలికి వచ్చిన పనివాళ్ళం. మాకు అప్పగించిన పనిని మేం పూర్తి చేసుకుని వెళ్లడం వరకే మా పని' అని ఆ చితి పక్కనే చితిని పేర్చి తమ వంతు పనిని పూర్తి చేసుకుని వచ్చారట."

"భేష్! ధర్మరాజూ, నీవు నియమించిన మనుమలు సైతం నీలా కర్తవ్య మెరిగిన వాళ్లు. నీవు తక్షణమే వెళ్లి నీ యజమాని మాటగా అతని భార్యా బిడ్డలతోనూ, బంధువర్గంతోనూ చెప్పవలసిం దేమిటంటే - ఇక్కడ అతని అంత్యేష్టి కోసం నేను అతి ఘనమైన ఏర్పాట్లన్నీ గావించాననీ, అతని శరీరాన్ని పన్నీరుతో కడవటి స్నాన మాడించి, ఖరీదైన అత్తరులు వంటికి పూయించి, ధూప ధూమాల్ని వేసి, ధవళ వస్త్రాన్ని చుట్టి పూలతో అలంకరించి, పరిమళాలను చిలకరించి, పుష్ప విమానం మీద ప్రతిష్ఠించి, దారి పొడవునా పూల జల్లుతో, వీడ్కోలు నినాదాలతో, మేళ తాళాలతో శ్మశానం వరకూ ఊరేగించుకుంటూ తరలి వెళ్లడానికి సకల ఏర్పాట్లూ చేశానని నా మాటగా వాళ్లకు చెప్పు."

"నే నా విషయాన్ని తమరి అనుమతిని తీసుకోకుండానే వెళ్లి వాళ్లతో చెప్పి వచ్చాను. తమరు ఇందుకు మన్నించాలి."

'ఏమిటీ! వాళ్లను కలిసి వచ్చావా?!"

"చిత్తం. మిత్ర వియోగం చేత దుఃఖితులైన మిమ్మల్ని ప్రతిదాన్నీ అడిగి ప్రతిదీ చెప్పించుకోవడం సేవకుడిగా నాకు భావ్యం కాదేమో నని అలా చేసి వచ్చాను."

"ధర్మరాజూ! నీవు కేవలం నా సేవకుడివి కావు; నా అంతరంగికుడవు కూడా. నీ కా స్వేచ్ఛ నే నివ్వకుండానే నీవు పొందగల సమర్థుడవు. ఇంతకూ నీవు ఎప్పుడు వెళ్లినదీ, ఏం జరిగినదీ నాకు చెప్పనే లేదు."

"నేను అక్కడకు వెళ్లే సరికి అది పగలు కానీ, రాత్రి కానీ కాదు."

"అయితే ఆ రెంటికీ నడుమ వెలుగు - నీడల సంగమ వేళ, మలి సంధ్య వేళ నీ వా ఇంటి వాకిలి చేరా వన్న మాట."

"చిత్తం. అప్పుడు కుంగిన సూర్యుడి కడవటి కిరణాల్లో ఆ వాకిట ఓ ఎత్తయిన వేదిక మీద తమ ప్రాణ మిత్రుని మృత దేహాన్ని చూశాను."

"ధర్మరాజూ! మనం తయారు కాక ముందే మన భవిష్యత్తు మన ముందుకు వస్తుంది. అందుకే జీవితం కష్టాలతో కూడి ఉంటుంది. నా స్నేహితుని హఠాన్మరణమే అందుకు సాక్షి. ధర్మరాజూ! ఆ త ర్వాత ఇం కేం చూశావు?"

"ఆ తర్వాత ఆ శవం చుట్టూ అశేష జనాన్ని చూశాను. వా ళ్లంతా విలపిస్తున్నారు. అతని భార్య అతని కోసం పరితపిస్తోంది; అతని బిడ్డలు రోదిస్తున్నారు. అతని బంధువులు దుఃఖిస్తున్నారు; వా ళ్లంతా నన్ను చూసి ఖిన్నులైనారు. అయినా నేను మీ ప్రతినిధిగా అక్కడ నిలుచుని, మీ మాటగా అంతా వివరించాను. అతని అంత్య క్రియలు మీ చేతుల మీదుగా జరగాలని మీ కోర్కెను తెలియజెప్పాను."

"నా ఆకాంక్షా అదే కదా! అప్పుడు వా ళ్లేమన్నారు?"

"ఆ సంగతి మీకు తెలియజేయడాని కిది నడి రేయి దాటిన నిశా సమయం. జగ త్తంతా నిద్రలో మునిగి, మీరు మేల్కొనే ఉన్నారు. తమరు కూడా కాస్త పక్క వాల్చి కునుకు తీసి, తెల్లవారగానే లేస్తే అంతా వివరంగా విన్నవించుకుంటాను."

"ధర్మరాజూ! నే నీ రాత్రి నిద్ర సాగిస్తే కదా లేవడానికి, రే పనేది తెల్లవారేది. శవం ఉన్నంతవరకూ జాగరణ జరగాల్సిందే. చివరి వ్యక్తి వరకూ ఈ మరణ వార్త నే నందజేయాల్సిందే. అందుకని అక్కడ ఏం జరిగినదీ సందేహించక వివరించు."

"చిత్తం. మీ మాటగా నేను చెప్పగా విని, అతని భార్య శవం వద్ద నుంచి లేచి వచ్చి, నాతో 'నేనూ, నా బిడ్డలూ, నా బంధువర్గం అంతా కలసి అతని అంత్యక్రియలను మా చేతుల మీదుగా జరుపుకోవా లనుకుంటున్నాం' అంది.

"అప్పుడు మీరు చేసిన ఏర్పాట్లన్నింటినీ పూస గుచ్చినట్టు ఆమెకు వివరించి చెప్పాను.

"ఆమె నా మాటను ఓ జీర్ణ తృణంలా తీసిపారేసి, 'మా మనిషి అంత్య క్రియను అత నెవడు జరపడానికి' అని ప్రశ్నించింది.

"అప్పుడు నేను మీ అనుబంధ బాంధవ్యాలను, వాటి ఔన్నత్యాన్ని యదార్థాలను ఆమెకు వివరించారు.


"నీవు అతని తాలూకు మనిషివి; అతని పక్షం వహించడంలో నీ తప్పేమీ లేదు గానీ, కట్టుకున్న భార్యనూ, కన్న బిడ్డలనూ పక్కనపెట్టి నిరంతరం అతనితోనే సాంగత్యం సాగించడం ఏ ఆడది సహిస్తుంది, ఏ బిడ్డలు క్షమిస్తారు, ఏ లోకం హర్షిస్తుంది?


"అతను బతికున్నంత కాలమూ అతని సాంగత్యంలోనే గడిపాడు. అప్పుడు ఆయన కోసం మేం ఏం చేయడానికీ మాకు ఏ అవకాశమూ దొరకలేదు. కనీసం ఆయన చనిపోయాకయినా ఆయన అంత్యక్రియలను జరిపించే అవకాశాన్ని మేం ఎలా జారవిడుచుకో మంటారు' అంది.

"అప్పుడు నేను ఆమెతో అవకాశం గురించి మాట్లాడటం కోసం రాలేదు. అతని అంత్యక్రియను ఘనమైనదిగా జరపడం కోసం మీతో అంతా మాట్లాడాలని ఆయన ప్రతినిధిగా వచ్చా నన్నాను.

"అప్పుడు ఆమె ముఖ మెత్తి నన్ను తేరిపార చూసి, నీవు లోకం మంచి చెడ్డలు ఎరిగిన మనిషల్లే ఉన్నావు. అతని అంత్యక్రియ అతని భార్యా బిడ్డల చేతుల మీదుగా జరగడం కన్నా లోకంలో మ రెవరి చేతుల మీదుగా జరగడం ఘనమైనదో నాకు చెప్పు. నేను ధర్మాన్నే ఆశ్రయిస్తున్నాను. లోక ధర్మా న్నెరిగి నీవు నాతో చెప్పు అంది."

"ధర్మరాజూ! అంతా అర్థమయింది. ఆమె ధర్మాన్ని గురించి నీతో ప్రస్తావించినప్పుడు నీవు నోరు మెదపలేక అస్త్ర సన్యాసం చేసి తిరిగి వచ్చేశా






వన్నమాట. ఈ భూమ్మీద ప్రతి ఆడదీ తన భర్త చుట్టూ వరిధిని నిర్మించి, తన హక్కులను చాటుకుంటుందే తప్ప అతని అభిరుచులనూ, ఆకాంక్షలనూ ఎందుచేతనో గౌరవించదు. నా చేతుల మీదుగా జరిగే ఈ అంత్యేష్టిని ఆమె ఆమోదించకపోతే ఆమె తన భర్త అభీష్టాన్ని ఆమోదించనట్టే.''

''తమరు ఆవేశవడకండి.''

''ధర్మరాజా! నే నెవరిపై ఆవేశవడాలి? ఆత్మీయుడు దూరమైనప్పుడు ఆ స్థితి మరణం కంటే కూడా బాధాకరంగా ఉంటుంది. అంతే!''

''చిత్తం. మానవ జీవితంలో అన్ని వ్యవహారాలూ ఒక తరంగంలా వస్తాయి. అందులో వడి మనం సుఖం వైపో, దుఃఖం వైపో కొట్టుకుపోతాం.''

''నీ వన్న మాటలు ముమ్మాటికీ నిజం. కానీ, ధర్మరాజా! నీ వెలాంటి ఓదార్పు మాటలు చెప్పినా నా ఈ దుఃఖా న్నుంచి అ వేవీ ఉవశమింవచేయడం లేదు ఎందుచేతనో.''

''తమరి ఆవేదన ముందు ఏ ఓదార్పు మాటలూ సరితూగ వనే నే ననుకుంటాను. మీ స్నేహ బంధం అలాంటిది మరి.''

''ఔనౌను. మా అనుబంధా లలాంటివే. లోకం దాన్ని గురించి ఏ మనుకుంటుందో?''

''మీ సేవకుడను. తమరు మన్నిస్తే ఒక్క విషయం మనవి చేస్తాను. అర్ధరాత్రి దాటి చాలా సేవయింది. తమరు ఇకనైనా వక్కవాల్చి, ఓ కునుకు తీస్తే, మీకు తెల్లవారగానే అంతా వివరంగా చెప్తాను.''

''ధర్మరాజా! వదే వదే నన్ను విశ్రమింవజేయా లని నీ వెందుకు ప్రయత్నిస్తున్నావు? నా అభీష్ట మేమిటో నీ వెరుగవా?''

''తమరు లోకాభిప్రాయం కోసం ఎందు కింత తావత్రయ వడతారు. మీ ఇరువురి స్నేహం నీవే నేనూ, నేనే నీవులా; నింగీ - నేలలా నిరంతరం కలిసే ఉంటుం దని, మీ అనుబంధం అద్వితీయ మని లోకానికి ఏనాడో తెలునును. అదే అనుకుంటోంది కూడా.''

''చాలు, ధర్మరాజా! అది చాలు. ఈ లోకం మా స్నేహాను బంధాలను శ్లాఘిస్తోం దనడానికి అంతే చాలు. ఇంతటి దుఃఖ నమయంలోనూ నీ మాట నా కెంతో ఓదార్పు నిస్తోంది.''

''కానీ ...''

''ఏమిటి, ధర్మరాజా!''

''ఈ లోకానికి ఓ ఆదర్శ మంటూ లేదు. అ దెప్పుడూ ఫలితాలను బట్టే తీర్పు నిస్తుంది.''

''ఇప్పుడు ఆ ప్రస్తావన దేనికి?''

''మీ మిత్రుడి చావుకు మీరే కారణ మంటోంది.''

''ధర్మరాజా!''

''తమరు మన్నించాలి.''

''ధర్మరాజా! ఏమిటి నీ వంటున్నది? అతని చావుకు నేనా కారణం? అతను గుండె ఆగి చనిపోయా డని లోకానికి తెలియదా? దానికి సాక్ష్యాధారాలు లేవా?''

''అతడు గుండె ఆగి హఠాన్మరణం చెందడానికి కారకులు మీరే నని


నాట్యాభ్యాసంలో కలిగే మెడ నొప్పులకు


కంప్యూటర్ స్క్రీన్ వలన కలిగే నొప్పులకు


మెట్లు ఎక్కడం వలన కలిగే నొప్పులకు

మహాస్ట్రాంగ్
పెయిన్ బామ్

ఈ కాలం నొప్పులకు ఈ కాలం బామ్

క్రొత్త మహా స్ట్రాంగ్ పెయిన్ బామ్ కలిగియున్నది నిజమైన శక్తిని: ఇందులోని శక్తివంతమైన మూల పదార్థములు, నేరుగా నొప్పియున్న చోటుకు చొచ్చుకుని పోయి, విపరీతమైన బాధల నుండి విముక్తి కలిగిస్తాయి. తృటిలో మీ మోముపై చిరునవ్వును తెప్పిస్తుంది.




O & M 3911 TG

క్రొత్త మహా స్ట్రాంగ్ పెయిన్ బామ్, మహా బాధల నివారిణి. అమృతాంజన్ లిమిటెడ్

లోకం అంటోంది."

"ఆ మా టన్న దెవరు?"

"అందరూ అన్నారు. అతని భార్య, అతని బిడ్డలు అన్నారు. అతని బంధువర్గం అంది. ఇం కెవ రనాలి?"

"ధర్మరాజూ! ఏమి టీ అపభ్రంశం?"

"చిత్తం. ఆ మాటే నేనూ వాళ్లతో అన్నాను. కానీ వా ళ్లంతా ఆయన బతికున్నంత కాలమూ దుర్మార్గులతో, దుష్టులతో, పాపులతో, పరమ నికృష్టులతో సాంగత్యం చేశా డని ఆయనపై అభియోగం మోపారు."

"ఇంతకూ ఆ నికృష్టు లెవ రట? ఆ పాపు లెవరట?"


"వాళ్లు మీరే నట."

"నేనా?"

"మీ అకృత్యాలను వెనకేనుకొస్తూ, మీ దుష్టత్వాన్ని సమర్థించుకొస్తూ అతని జీవితాంతం అశాంతితో ఒత్తిడికి లోనై గుండె పగిలి అకాల మరణం చెందాడట."

"అది నీవు నమ్ముతున్నావా, ధర్మరాజూ!"

"నిజాన్ని ఎప్పుడూ, ఎవరూ తుడిచివేయలేరు. అయినా ఏ యజమానికీ తన సేవకుడి నమ్మకాలతో ఏ పనీ ఉండదు. నేను నమ్మినా,




నమ్మకపోయినా ఈ లోకం నమ్ముతోం దని మీకు తెలియజేస్తున్నాను."

"ధర్మరాజూ! సమయం ఆసన్నమైనపుడు నిజాన్ని నిజంలా ఒప్పుకున్నవాడే మనిషి.

"ఈ లోకం కొందరి పట్ల కళ్లుండీ గుడ్డిది; చెవు లుండీ చెవిటిది; నోరుండీ మూగది. నా మిత్రుడు బతికున్నంత కాలం న న్నెన్నడూ వేలెత్తి చూపని ఈ లోకం అతడు చనిపోగానే దాని సర్వశక్తులూ, సకల యుక్తులూ నాపైకి సమీకరిస్తోంది. అయినా నేను నిజాన్నే మాట్లాడతాను. ఎందుకంటే నిజా లన్నీ మృత్యు వనే న్యాయస్థానంలో పరీక్షించబడతా యని మన పితరు లనేవారు. కనుక నేను చెప్పదలచిన దేమిటంటే ...

"నేను అపరాధినే!

"ఎలాంటి అకృత్యా న్నయినా చేసి నే నతని నీడలో దాగుకునేవాడిని. నా అపరాధా లన్నీ అతని నీడలోనే కనుమర గయ్యేవి. అతని పేరు ప్రతిష్ఠల మాటున, వ్యక్తిత్వం నీడన నా అకృత్యా లన్నీ అంత మయ్యేవి. ఎన్నో కుత్సితాలు, ఎన్నో కుతంత్రాలూ, అరాచకాలు, మోసాలు, దౌర్జన్యాలు అతని నీడ చాటునే కనుమరు గయ్యాయి. ఎందుకో తెలుసా - వ్యక్తిత్వం అనేది ఒకానొక అనిర్వచనీయమైన శక్తి. అది తిమ్మిని బమ్మిని చేస్తుంది; బమ్మిని తిమ్మిని చేస్తుంది. అది మానవాత్మలపై అధికారం చెలాయిస్తుంది. అంతటి వ్యక్తిత్వం గల నా మిత్రుడు అజేయుడు; అసామాన్యుడు; అందుచేతనే నే నతనిని ఆశ్రయించాను.

"అతడు నా అపరాధాల గురించి న న్నెన్నడూ ప్రశ్నించలేదు. ఏనాడూ మందలించలేదు. నన్ను చూసీ చూడనట్టు, నా పొరపాట్లు తెలిసీ తెలియనట్టు ఊరకుండి మా మిత్రత్వానికి తెగని బంధం వేశాడు.

"ధర్మరాజూ! వట వృక్షంలా నా మిత్రుడు తన వచ్చని కొమ్మల్ని నా జీవితం మేరా విస్తరించి, అపరాధాలతో అలసిపోయిన నాకు తన చల్లని నీడ నిచ్చి సేద దీర్చాడు.

"అలాంటి నా మిత్రుడు కేవలం నాకు మిత్రుడు మాత్రమే నంటావా? కాదు; అతను నా గాడ్ ఫాదర్. ఎందుకలా ఆశ్చర్యంతో చూస్తావు? అతడు ముమ్మాటికీ నాకు గాడ్ ఫాదరే.

"ఇంకా చెప్పమంటావా?

"నేను ఎందరినో దోచుకున్నాను. అతని పక్కన నిల్చున్న నన్ను ఎవరూ వేలెత్తి చూపలేదు.

"నిజానికి నేను హంతకుణ్ణి. ఎన్నో హత్యలు చేసి అతన్ని ఆశ్రయించేవాడిని. అతని అభయ హస్తం నా భుజం మీ దుంచి, నా వదనాన్ని ప్రసన్నం చేసి, నన్ను వేదికల వద్దకు కొనిపోయేవాడు. ప్రజలు మాకు స్వాగత వచనాలు పలుకుతూ అతనితోపాటు నాకూ వేదికపై ఉన్నతాసనం వేసి, అతని పక్కనే నన్నూ కూచుండబెట్టి ఘనపరిచేవారు. కనుక, ధర్మరాజూ!"

"చిత్తం. తమరు ఇంత చెప్పాక నేను ఏదీ దాచవలసిన అవసరం లేదు."

"ఔను. నీవు నా సేవకుడివి, నా ఆంతరంగికుడివి. లోకం ఏ మనుకున్నా నీకు తెలిసిన దేదీ నా నుండి గోప్యంగా ఉంచకూడదు."

"చిత్తం. లోకాని కేముంది - అది ఏదైనా అనుకుంటుంది."

"ధర్మరాజూ! నీవు నా సేవకుడివి."

"మీ సేవకుడినే. నేను మీ కేదీ మరుగుపరచడం లేదు. ఇంతకాలమూ మీ మిత్రుడు కోడి తన పిల్లల్ని రెక్కల కింద కాపాడినట్టు మిమ్మల్ని మీ శత్రువుల బారి నుంచి కాపాడుకొచ్చారట. అతడు ఎలాగూ గతించాడు. ఇక మీ అకృత్యాల నుంచి మిమ్మల్ని ఏ శక్తీ కాపాడలేదట. ఈ అసూయలు, ఆత్యాశలు, అత్యాచారాలు, దోపిడీలు, దమనకాండలు - ఏవీ ఈ లోకం సాగనివ్వదట. ఇంతకాలమూ సాగిన అక్రమాల నన్నింటికీ నంజాయిషీ అడుగుతుందట. అందుకని మీ అకృత్యాలకి ఇకపై ఆటకట్టట!"

"ధర్మరాజూ! పో! ఈ గడప దాటి బయటికి పో!"

"తమరి సేవకుడను. నే నెక్కడికి పోతాను?"

"ధర్మరాజూ! నిన్ను బయటికి పొమ్మని ఆజ్ఞాపిస్తున్నాను. నా నుంచి తక్షణమే ఎక్కడికైనా పో!"

"తమరి ఆజ్ఞను శిరసా వహించగలను కానీ, మిమ్మల్ని ఈ సమయంలో ఒంటరిగా వదిలి వెళ్లడం సేవకుడి ధర్మం కా దని సంశయిస్తున్నాను. మీ శరీరం మీది స్వేద బిందువులు ధారాపాత మవుతున్నాయి. మీ శ్వాస తెగిన గాలిపటంలా ఊగిసలాడుతోంది. పగిలిన నావ మునుగుతున్నట్టు శరీరం కుంచించుకుపోతోంది. నే నిపుడు మీ కోసం చేయగలిగిన సేవ ఏమున్నదో సెలవీయండి."

"ధర్మరాజూ! నీ వింకా నా గుమ్మం ముందే ఉన్నావా? మౌనంగా నా పిలుపు కోసం వేచి ఉన్నావా! ముమ్మాటికీ నీవు నా సేవకుడివి. నా అక్కర లన్నీ నా కంటే ముందుగానే ఎరుగున్నవాడివి. ఈ లోకాపవాదుల నుంచి నన్ను సంరక్షించే వాడవూ నీవే. రా, నీవు తొందరగా వచ్చి నా గుండెను హత్తుకుని గట్టిగా ఆలింగనం చేసుకో. జారిన క్షణం నాది కాకపోవచ్చు. రా, ధర్మరాజూ! రా!" అని కుర్చీ మీదుండి వాలిపోయాడు.

** ** **

ఒకదాని పక్క ఒకటి. రెండు చితులకూ ఒకేసారి నిప్పంటుకుంది.

ప్రాణ మిత్రు లంటే ఇలా ఉండా లన్నా రంతా.

మిత్రుడి మరణ వార్త విని ప్రాణాలు విడిచిన మిత్రుడట. ఎంతటి గొప్ప అనుబంధమో అన్నారు మరికొందరు.

అటు శ్మశానం నుంచి వెళ్తూ ఎవరో ధర్మరాజు వద్దకు వచ్చి, "నీవు అతడి సేవకుడివే కదూ! అతని చితిని అతనే పేర్చుకున్నాడట. అతని అంతిమ యాత్ర అతనే నిర్దేశించుకున్నాడట. ఏ గడ్డ మీద పుట్టాడో ఆ గడ్డ మీదనే అంత్య క్రియ జరుగుతోందట కదా!" అని అడిగాడు.

"దానిలో ఆశ్చర్య మేముందీ? ప్రతివాడూ తన చితిని తానే పేర్చుకుంటాడు. తన అంతిమ యాత్రను తానే నిర్దేశించుకుంటాడు."

"నీవు నమ్మకమైన సేవకుడి వని విన్నాము. అక్కడ అంతిమ సంస్కారం జరుగుతూంటే మరి నీవు నాలుగు రోడ్ల కూడలిలో ఎవరి కోసం ఎదురు చూస్తున్నావు?"

"మృతునకు నేను చేయగల సేవలు ఏముంటాయి? నన్ను గుర్తించగల యజమాని కోసం వెదుకుతున్నాను" అన్న్యకన్ను లెత్తి చూశాడు.